

# చుక్కలు చచ్చిపోయాయి

వెన్నెలకింకా వేడి రాకమునుపే, పడుచుకులపు పిల్ల తోటలో మాటేసి మనసుగాని రాకకు మీనమేషాలు లెక్కపెడుతున్నసమయాన, వయస్సుర్తి ఉసికొల్పేటట్లు మత్తుగాలి వీస్తున్న నిముసాన అత్తరుపరిమళం గుబాళించింది.

చిత్తరువులాంటి చిన్నది ఆశలకు పోయింది.

తిరిగి తిరిగి కో అంది కోయిల సన్నాయి.

వయసునిగారింపువాడొకడు దాపునున్న పూల తోపులో దాగి, కొమ్మల గల గల లాడిస్తే పువ్వులు జలజల రాలాయి. వయసుపిల్ల గుండెలు ఘల్లుఘల్లు మన్నాయి.

దిక్కుల్లోకి చుక్కల్లోకి అందీ అందని మదుర

భావరాగం లాస్యం చేస్తూండగా చూసింది చిన్నారి.

జంటచేతులు కళ్ళు మూశాయి. గులాబీలపై చిన్నముద్దు. వయసుల వాకిట వలపు నిదుర లేచింది. పడుచుదనం పండుగ చేసుకుంది. గుండెలు యుగళ గీతాలు పాడుకున్నాయి. తనువు లొకటై పువ్వుల కౌగిట్లోకి పోయాయి.

వయసుచంద్రుడు విచ్చిన వెన్నెల పువ్వయి ఆ ప్రణయజీవులదాగాన్ని తనలోని మధువుగా చేసుకున్నాడు.

వెన్నెలపడుచు గుండెలను, ఏడుసువెట్టిన కత్తిలా తాకేటప్పటికి ఒకరిలోంచి ఒకరు లేచారు.

సంపెంగగాలులు వీవన విసిరి సేద తీర్చాయి.

చిర్నవ్వులు వసంతాలాడుకున్నాయి.

"మనసు తీరింది పిల్లా! వయసు మురిపెం తెలిపావు. ఏం కావాలో కోరుకో!"

"దొరవారి చిర్నవ్వుగంధాలతో గుండె పూదోటయింది. ఇంకేంకావాలి సామీ, ఈ పేదరాలికి?"

"ఆశలాంటి అందంగల అన్నులమిన్నవు. వయసుచే ఊడిగం చేయించగల మమత మనసు ఉంది నీలో. వెన్నెల్లోంచి, వేణువులోంచి, చందనంలోంచి, మల్లె ల్లోంచి మాధుర్యాలను సంతరించుకున్న మానినివి. నా మాట కాదనక ఏం కావాలో కోరుకో!"

"వసంతాల వెన్నెలలను ఊరకే పోనివ్వనని మాట ఇయ్యండి సామీ! అదే చాలు."

"సరే! వసంతంలానే కొత్తకోర్కెల చివుళ్ళు తొడిగించిన ఒయ్యారీ, పోనామరి?"

"వెన్నెలదారినపో మారాజా! మనసు కళ్ళతో ఎదురు చూస్తుంటాను. మరిచిపోకు" అని గాలివాలుల్లోకి ఎగిరిపోయింది.

చుక్కల్లోంచి, దిక్కుల్లోంచి, మబ్బుల్లోంచి, మాను ల్లోంచి చంద్రుడు సంబరం చూసి మురిసిపోయి కాబోలు వెన్నెలలోకి చేరాడు.

తిరిగి వసంతం వచ్చేసింది. వెన్నెలా వచ్చింది. కోయిలా కూసింది.

పూలల్లో కూర్చున్న పడుచు చందమామ కేసి చూసింది.

అత్తరువరిమళాలు ఇంకా గుండెదావుకి రాలేదు.

ఆశను నమ్ముకున్న చిన్నది, అలా అలా చూస్తూనే ఉంది.

చుక్కలు ఇంకిపోయాయి. వెన్నెల సోలిపోయింది చిన్నది చూస్తూనే ఉంది.

మళ్ళా వెన్నెల వచ్చింది. చిన్నది చూస్తూనే ఉంది. పరిమళం రాలేదు.

పది వసంతాలు పారిపోయాయి.

పరిమళం మాత్రం మరి రాలేదు. ఆశ చావలేదు. పడుచుదనం పండిపోయింది.

అయినా నిరీక్షణ మాత్రం మానిందికాదు మనసులోని ఆశ.

జీవితమంతా నమ్మకమే అయి, తోటే ఆమె అయింది.

'ఏనాటికైనా ఆనాటి పరిమళం మరోసారి తన బ్రతుకు సంజెల్లో నిండుతుంది' ఆశ.

కళ్ళల్లో కోరికల దీపాలు వెల్గించుకుని, వసంతాల రాత్రుల్లో ఆమె చూస్తూనే ఉంది.

ఎన్నో వసంతాలు రెక్కలు వచ్చి ఎగిరిపోయాక,

**ఆశ అందంగా ఉంటుంది. అందం, ఆశగల అన్నులమిన్న రాచ వారి చిన్నవాని మనసునైనా యిట్టే దోచుకోగలదు — ఆ పరవశంలో పులకించి, మరో మధురానుభవం కోసం జీవితాంతం ఎదురుచూడనూ గలదు. మనసు దోచుకున్నవాడు మరి రాకపోతే ... ఆమె గుండె పిలుపు అతనికి వినపడకపోతే ...**

ఆనాడెందుకో వెన్నెల ఆవేశంతో నగ్నంగా నృత్యం చేస్తూంది.

వయసుకోయిల కూ, కూ అని అమలమోహనంగా పాడుతూంది. పువ్వులు కుప్పలు కుప్పలుగా విరిసి పోతున్నాయి.

పువ్వుల్లో అరముగ్గిన మనసు, పరిమళం కోసం ఎదురు చూస్తూంది.



ఊరిదారి....
ఫోటో—ఆర్. ఎ. జంసాండేకర్
(బొంబాయి-12)

ఆకుల గలగల. . . సడికి ఆశగా చూసింది.

"ఎవరమ్మా నీవు? ఒంటరిగా ఈ తోటలో ఉన్నావ్?"

"నేను చావని ఆశను బాబూ! నమ్మకం వస్తుందేమో నని జీవితమంతా ఎదురుచూస్తున్నాను."

"ఇక్కడనుంచి ఏదో పిలుపు వినపడితే, దారినేపోతూ వినివచ్చాను. పిలిచావా?"

"పిలిచేకాలం కరిగిపోయింది నాయనా! నా నమ్మకం నిజమయ్యాక పిలిపించుకుంటాను."

"ఎవరికోసమమ్మా ఇలా వయసు ముగ్గినా ఎదురు చూస్తున్నది?"

"ఆనాటి పరిమళాల హృదయం కోసం బాబూ! వసంతోత్సవాల కౌగిట్లో కలుసుకుని ఆశల కళ్ళదీపాలు వెలిగించుకున్నాం. ఆ రాత్రులు యౌవనానికి నిర్వచన మిచ్చాయి. ఈ తోట, ఈ పూలు బృందావనిలా గొల్లపిల్లలలా పునీతమయ్యాయి. ప్రతి వసంతం మాదే అని బాసలతో ఆశల పందిళ్లల్లుకున్నాం. అయినా పందిరిలో వెన్నెలపూలు మరి విరిశాయికావు. కలయిక కోసమే ఈ కోర్కెలగూడు ఇలా కూర్చుంది నాయనా!"

"ఎవరమ్మా నీ ముచ్చటకాడు?"

"నా దేవుడు."

"ఎలా ఉంటాడో చెప్పగలవా?"

"వయసు వలపు ఎలా ఉంటుంది అంటే ఏం చెప్పను? నా ఊర్పుల నీరాజనాలందుకునే స్వామిని గురించి ఏం చెప్పనయ్యా?"

"అమ్మా! ఎందుకో నీకు సాయం చెయ్యా లనిపిస్తూంది. అతనెవరో చెబితే ప్రయత్నిస్తానమ్మా!"

"ఎందుకయ్యా ఆ వెర్రి అభిమానం? వెన్నెల సాయం చేసిందా? పిల్లగాలులు, పూలపిల్లలు సాయం చేశాయా? నీ కెందుకయ్యా నామీద ఇంత సానుభూతి?"

"ఒకనాటి బాస నిజమవుతుందని జీవితమంతా ఇలా ఎదురుచూస్తూ కూర్చున్నావంటే, ప్రేమంటే ఏమిటో తెలిసిందమ్మా! అందుకే, నోరువిప్పి అడుగు తున్నాను, ఎవరమ్మా నీవాడు?"

"వసంతనగరివాడు. చల్లనిరేడు."

"యువరాజా!"

"ఔను నాయనా! వసంతనగరికి యువరాజు. నా మనసుకి మహారాజు."

"వసంతనగరి యువరాజా!"

"ఏం బాబూ! నా స్వామి నీకు తెలుసా బంగారుతండ్రీ! ఎలా ఉన్నారయ్యా ఆయన? చల్లగా తిరుగుతున్నా రటయ్యా?"

"తెలుసమ్మా! బాగా ఉన్నారు."

"ఈ కథ మాత్రం చెప్పు నాయనా! రమ్మని పిలవకు! గుండెపిలుపు వినపడాలి. తనకోసమే ఈ పువ్వు వాడినా మాడినా రాలకుండా ఉందని తెలుసు కోవాలి."

"తప్పకుండా అవ్వా! వస్తాను."

అయినా ఏం చెబుతాడని? ఎవరికి చెబుతాడని?

ఆ రాత్రి తోపులోంచి వస్తూ మొగలినాగుకాటుకి మారాజా మరణించాడని అవ్వకు చెబుతాడా? అమ్మ ఆశ మరణించిన మారాజుకు చెబుతాడా?

ఆయన వారసుడైన ఈ యువరాజేం చెబుతాడు?

"మరణించిన మారాజు కోసం నాటి వలపు ఎదురు చూస్తూంది. అతను వస్తే తను వెళుతుందిట" అని గాలికి చెప్పి తన దారిన తాపోయాడు.

అయినా ఎందుకో, భగవంతుడు వింటాడని నమ్మక ముంది అతనికి. తెల్లారేసరికి అమ్మమనసులో దీపం ఆరిపోయింది వెన్నెలలానే!

చుక్కలు చచ్చిపోయాయి! ★

**జి. నరసింహారావు**